సాక్షి విశాఖపట్నం

మంగళవారం ; 29 ; ఆగస్టు ; 2023



సిటీ ఆఫ్ 'స్పోర్ట్స్' డెస్టినీ

మహా విశాఖ నగరంలో సమీకృత క్రీడా ప్రాంగణాలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. 12లో



భాష.. భావాలకు వారధి

వాడుక భాష వ్యావహారిక భాష కావాలని పరితపించి. పోరాడి సాధించిన వ్యక్తి గిడుగు రామమూర్తి. నేడు ఆయన జయంతి. 8లో

నవీన్ పొలిశెట్టి సందడి



విశాఖలో మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి చిత్ర హీరో నవీన్ పొలిశెట్టి, దర్శకుడు మహేష్‌బాబు సోమవారం సందడి చేశారు.

న్యూస్‌రీల్

నేడు బీచ్‌లో ఎకో వైజాగ్ వాక్

పాల్గొనున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ

దాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా జీవీఎంసీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 6 గంటలకు ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు 'ఎకో–వైజాగ్ వాక్' నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శరత్‌చంద్రారెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఏయూలో డిజిటల్ కాగ్నిటివ్ థెరపీ సెంటర్ ప్రారంభం



సెంటర్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఏయూలో డిజిటల్ కాగ్నిటివ్ థెరపీ సెంటర్ ఏర్పాటైంది. కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ ఏయూతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అధునాతన డిజిటల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ని ఏయూకు అదించింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని నార్త్ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సీఈఓ డాక్టర్ వినయ్ సింఘ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు. దీని సహాయంతో విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి.. అవసరమైన వారికి వెంటనే చికిత్స అందించవచ్చని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. భవిష్యత్తులో సౌత్ క్యాంపస్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

వెంకట్‌కు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం



అగనంపూడి: తెలుగు సాహిత్యంలో రంగంలో తనదైన శైలిలో రచనలతో పాఠకుల మన్ననలు అందుకున్న వెంకట్ కంచిపాటి (నరసింహ మూర్తి) గిడుగు జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో గిడుగు రామమూర్తి పంతులు జయంత్యుత్సవాల సందర్భంగా నరసింహమూర్తికి పురస్కారం అందించనున్నట్టు గిడుగు రామమూర్తి ఫౌండేషన్, శంకర్ వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు అగనంపూడికి చెందిన యువ కవి, వెంకట్ కంచిపాటి తన కలం నుంచి జాలువారిన 'అతన్నలా వదిలేయకండి' కథా సంపుటికి ఈ అర్హత దక్కినట్టు ఫౌండేషన్ నిర్వాహకులు కళారత్న బిక్కి కృష్ణ, గిడుగు శాంతికృష్ణ, ధనలక్ష్మి తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

దొండపర్తి: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు నిర్మాణ్ సంస్థ సీఈఓ మయూర్ పటాన్ల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా బాజీ జంక్షన్ ప్రాంతంలో ఉన్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, 9502874304, 9908104113 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

30న షాలిమార్–సికింద్రాబాద్ రద్దు

తాటిచెట్లపాలెం: ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం, లింక్ రైలు అందుబాటులో లేనందున ఈ నెల 30వ తేదీన షాలిమార్–సికింద్రాబాద్(22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఆడుతూ.. చదువుతూ..



విశాఖలోని క్వీన్ మేరీ స్కూల్లో వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

- వ్యాయామ విద్యకు పెద్దపీట
- పాఠశాలలకు క్రీడా పరికరాలు సరఫరా
- క్రీడల్లో ప్రతిభచూపే విద్యార్థులకు ప్రోత్సాహం
- జిల్లాలో ఐదు స్కూళ్లకు క్రీడా పురస్కారాలు
- నేడు గోపాలపట్నంలో జిల్లా స్థాయి క్రీడోత్సవం

విశాఖ విద్య: ఆడుతూ.. పాడుతూ.. చదువుకునే రోజులు మళ్లీ వచ్చేశాయి. ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో వ్యాయామ విద్యకు పెద్ద పీట వేస్తున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించటంతో పాటు, పాఠశాలల్లో ఆడుతూ.. పాడుతూ చదువులు సాగేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్‌లను సరఫరా చేసేందుకు నిధులు కేటాయించింది. రాష్ట్ర స్థాయిలో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి ప్రస్తుతం మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు చేరుతోంది. వీటిని పది రోజుల్లో అన్ని పాఠశాలలకు చేర్చేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు.

నచ్చిన ఆట ఆడుకునేలా..

విద్యార్థులు తమకు నచ్చిన ఆట ఆడుకునేలా అవసరమైన క్రీడా సామగ్రిని స్కూళ్లకు సరఫరా చేస్తున్నారు. ప్రైమరీ స్కూళ్లకు తొమ్మిది రకాల క్రీడా పరికరాలతో కూడిన స్పోర్ట్ కిట్ సరఫరా చేయనున్నారు. వీటిలో ఫైబర్ క్రికెట్ బ్యాట్, వికెట్లు, టెన్నిస్ బాల్, వాలీబాల్(నివాస్), హ్యాండ్ బాల్, మల్టీ కలర్ హూలా హూప్స్, స్కిప్పింగ్ రోప్ తదితర వస్తువులు ఉన్నాయి. అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు 14 రకాల ఆటవస్తువులు ఇస్తున్నారు. హైస్కూళ్లకు 17 రకాల ఆట వస్తువుల కిట్‌ను సరఫరా చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వాలీబాల్, నెట్, త్రోబాల్, త్రోబాల్ నెట్, హ్యాండ్‌బాల్, టెన్నీ కాయిట్ రింగ్, నెట్, యోగా మేట్, చెస్, ఫుట్ బాల్, వేయింగ్ మిషన్, షాట్ పుట్, డిస్కస్ త్రో వంటి క్రీడా పరికరాలు ఉన్నాయి.

క్రీడాకారులకు ప్రోత్సాహం : విద్యారంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం.. తరగతుల నిర్వహణలో భాగంగా ప్రతీ రోజూ వ్యాయామ విద్యా బోధన సాగేలా అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించింది. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, పాఠశాల నిర్వాహకులకు సైతం తగిన గుర్తింపు ఇచ్చేలా ఈ ఏడాది వారికి మెమెంటో, ప్రశంసా పత్రాలతో గౌరవించనున్నారు. ఆటల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిన జిల్లాలోని ఐదు పాఠశాలలను 'బెస్ట్ ఎక్సలెన్స్ స్పోర్ట్స్ అవార్డు'ల కోసం ఎంపిక చేశారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గోపాలపట్నం క్రీడా మైదానంలో నిర్వహించే జిల్లా స్థాయి వేడుకల్లో సదరు పాఠశాలల నిర్వాహకులకు అవార్డులను అందజేయనున్నారు.

బెస్ట్ స్కూళ్లు ఇవే..

- ద నన్ స్కూల్ కీతిన్‌పేట(భీమునిపట్నం)
- జెడ్పీ హైస్కూల్, ఎండాడ(చినగదిలి)
- జీవీఎంసీ హైస్కూల్, ఎన్‌జీజీవోస్ కాలనీ (సీతమ్మధార)
- ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, శ్రీకృష్ణాపురం (చినగదిలి)
- జెడ్పీ హైస్కూల్, వాడపాలెం (చినగదిలి)



స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైన స్కూళ్లకు ఇవ్వనున్న మెమెంటోలు

ఐదు పాఠశాలలకు క్రీడా పురస్కారాలు



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2022–23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఎంపిక చేసిన ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలు అందించనున్నాం. గోపాలపట్నంలోని డీఎస్ఏ మినీ స్టేడియంలో ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి

– చంద్రకళ, డీఈఓ విశాఖపట్నం

క్రీడలకు ప్రాధాన్యం



పాఠశాల స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చూపటం విద్యార్థులకు మేలు చేస్తుంది. క్రీడల్లో ఆల్ రౌండ్ ప్రతిభ చూపిన పాఠశాలలను ఎంపిక చేసి, నిర్వాహకులను గౌరవించటం హర్షించదగ్గ విషయం.

– బి.రామచంద్రనాయుడు, ఫిజికల్ డైరెక్టర్, అడవివరం జెడ్పీ హైస్కూల్

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం



కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖుబా, ఎంపీ జీవీఎల్‌తో అభ్యర్థులు

కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా

తాటిచెట్లపాలెం: దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ప్రధాని మోదీ ఆశయమని, దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా సోమవారం 8వ రోజ్‌గార్ మేళా నిర్వహించి, అర్హులైన అభ్యర్థులకు నేరుగా నియామకపత్రాలు అందజేశామని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. సోమవారం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళా ప్రారంభించి, ఇప్పటి వరకు సుమారు 5 లక్షల మందికి పైగా వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు కల్పించారన్నారు. సోమవారం వర్చువల్‌గా మరో 51 వేల మందికి నియామకపత్రాలు దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో అందజేశామని తెలిపారు. విశాఖలో జరిగిన ఈ మేళాలో కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని పీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, సీఏపీఎఫ్, అస్సాం రైఫిల్స్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎన్‌సీబీ, ఢిల్లీ పోలీస్ వంటి విభాగాల్లో కానిస్టేబుల్స్(జనరల్ డ్యూటీ), సబ్ ఇన్‌స్పెక్టర్ (జనరల్ డ్యూటీ), నాన్ జనరల్ డ్యూటీ కేడర్‌లలో ఉద్యోగాలు పొందిన సుమారు 650 మందిలో 25 మందికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ మాట్లాడుతూ 2024 మే నెలాఖరు నాటికి 10 లక్షల ఉద్యోగాలు మోదీ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ సెక్రటరీ టి.వేణుగోపాల్, సీఐఎస్ఎఫ్ దక్షిణ జోన్ డీఐజీ మాలేటి నందన్, ఆయా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు 582 మంది

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం 800 మంది అభ్యర్థులకు గానూ 582 మంది హాజరయ్యారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సమక్షంలో పోలీస్ అధికారులు అభ్యర్థుల కులధ్రువీకరణ పత్రాలు, హాల్ టికెట్లు, విద్యార్హతలు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అనంతరం బ్యాచ్‌లు వారీగా 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్, ఎత్తు కొలవడం, తదితర ఈవెంట్స్ నిర్వహించారు.



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

భవిష్యత్తు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌దే..

- దేశంలోని అన్ని పోర్టులకు డీసీఐ కీలకం
- సామర్థ్యం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాం..
- డీసీఐ, వీపీఏ చైర్మన్ అంగముత్తు వెల్లడి
- డీసీఐలో ఘనంగా జీఎంఐఎస్–2023 రోడ్‌షో
- వర్చువల్ విధానంలో హాజరైన కేంద్ర మంత్రులు



మాట్లాడుతున్న డీసీఐ, పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : దేశంలోని అన్ని మేజర్ పోర్టులతో పాటు ప్రైవేట్ పోర్టుల్లోనూ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) కీలకంగా మారబోతోందని డీసీఐ చైర్మన్, విశాఖ పోర్టు చైర్మన్ డా.అంగముత్తు అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్టోబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ న్యూఢిల్లీలో జరిగే గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్–2023కి అనుబంధంగా డీసీఐ ప్రధాన కార్యాలయంలో రోడ్ షో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ అంగముత్తు, ఎండీ కెప్టెన్ దివాకర్ ప్రారంభించగా.. వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రులు శర్బానంద సోనోవాల్, శాంతానుఠాకూర్, శ్రీపాద యశో నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ ప్రస్తుతం గ్లోబల్ ఎకనామీ వాణిజ్యంపై ఆధారపడి ఉందనీ.. జీడీపీ విలువలో 80 శాతం వరకూ మారిటైమ్ ట్రేడ్ జరుగుతోందన్నారు. బ్లూ ఎకానమికీ అపారమైన అవకాశాలున్నాయనీ.. వాటిని ఆత్మనిర్భర్ భారత్‌తో అందిపుచ్చుకోవాలన్నారు. డ్రెడ్జింగ్ చేయకుండా ఏ పోర్టు అభివృద్ధి జరగదనీ.. అందుకే ప్రధాని కూడా ఇన్‌లాండ్ వాటర్‌వేస్‌పై దృష్టిసారించారని వివరించారు. దేశంలో డ్రెడ్జింగ్ కోసం 120 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకూ డిమాండ్ ఉన్న నేపథ్యంలో డీసీఐ ప్రస్తుత సామర్థ్యం 65 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా.. రెండేళ్లలో 85 మిలియన్లకు చేరుకోనున్నట్లు తెలిపారు. సంస్థను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉద్యోగులంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. డీసీఐ ఎండీ కెప్టెన్ దివాకర్ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాల్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన 4 మల్టీ నేషనల్ కంపెనీలతో కలిసి అడుగులు వేస్తున్నట్లు వివరించారు. 2025 నాటికి 12000 టన్నుల హోపర్ కెపాసిటీ డ్రెడ్జ్, 2028లో మరొకటి, 2030లో ఇంకో డ్రెడ్జర్ డీసీఐకు రానున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, నెదర్లాండ్ ఎంబసీ కౌన్సిలర్ జుస్ట్‌గీజర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే పేదల జీవితాల్లో వెలుగు

- జగనన్న విద్యా దీవెనను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 40,673 మందికి రూ.32.55 కోట్ల నిధుల విడుదల



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట: చదువుతోనే పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని భావించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. సోమవారం జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా ఏప్రిల్–జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరిలో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారు. ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ మల్లికార్జున పలు శాఖల అధికారులతో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నగరాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పిల్లా సుజాత, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, గ్రామ ,వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమా దేవితో కలిసి విద్యార్థులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద 40,673 మంది విద్యార్థులకు రూ.32.55 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. జిల్లాలో 3,976 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.3.55 కోట్లు, 170 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.15.13 లక్షలు, 29,768 మంది బీసీ విద్యార్థులకు రూ.23.28 కోట్లు, 4,126 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.3.33 కోట్లు, 1,287 మంది కాపు విద్యార్థులకు రూ.1.12 కోట్లు, 199 మంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.19 లక్షలు, 1147 మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.91 లక్షలు జమ చేశారన్నారు.

ప్రభుత్వ సహకారం మరువలేను



నేను సాయి గణపతిలో పాలిటెక్నిక్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్నాను. ఈ సమయంలో మా నాన్న మృతి చెందారు. నా చదువు ఎలా కొనసాగుతుందన్న భయం వేసింది. జగనన్న విద్యా దీవెన కింద ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని తెలిసిన వాళ్లు చెప్పడంతో సంతోషం కలిగింది. ఇప్పుడు జగనన్న విద్యా దీవెన పథకంలో నాకు డబ్బులు వచ్చాయి. నా చదువు పూర్తవుతుందన్న నమ్మకం కలిగింది. ప్రభుత్వం అందిస్తున్న సహాయం మరువలేను.

– ఎస్.నాగమణి, పాలిటెక్నిక్ విద్యార్థిని, పూర్ణామార్కెట్

ఉన్నత చదువులకు ఉపయోగం



మా నాన్న వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నేను సాయి గణపతి కాలేజీలో పాలిటెక్నిక్ చదువుతున్నాను. భుక్తి గడవడమే దుర్భరంగా ఉన్న మా కుటుంబానికి ఉన్నత చదువులు కష్టమని భావించాను. కానీ తోటి స్నేహితులు అంతా చదువుకుంటున్నారు. నేను కూడా ఉన్నత చదువులు చదువుకోవాలని అనుకున్నాను. జగనన్న విద్యా దీవెన పథకం ఎంతగానో ఉపయోగపడింది. ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి ధన్యవాదాలు.

– సాయి దేవా, విద్యార్థి విజయనగరం

అనర్హులకు అందలం

- గందరగోళంగా హెల్త్ విజిటర్ల కౌన్సెలింగ్
- సీనియారిటీకి తిలోదకాలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన హెల్త్ విజిటర్లు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో హెల్త్ విజిటర్స్ సర్దుబాటు కౌన్సెలింగ్ గందరగోళంగా తయారైంది. అనర్హులకు అందలం ఎక్కించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులతోపాటు 14 మంది సిబ్బంది ఉండాలన్న ఆశయంతో ప్రభుత్వం స్టాఫ్ రీఫిక్సింగ్ కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి చేపట్టారు. ఉత్తరాంధ్రలోని 255 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 191 మంది హెల్త్ విజిటర్స్ సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

ఆరోపణల వెల్లువ : కౌన్సెలింగ్‌కు పిలిచిన సీరియల్ సంఖ్యలో ఎక్కువ సంఖ్యలో ఉన్నవారికి అధిక ప్రాధాన్యమిచ్చారని విమర్శలు వెల్లువెత్తాయి. జాబితాలో సీనియర్లను చివరిలో కౌన్సెలింగ్ చేయడం, ప్రాధాన్యమున్న కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం, సీనియారిటీని పక్కనబెట్టడంపై హెల్త్ విజిటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌లో కొంత మంది అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలు పాలుచేస్తోంది. బదిలీల విషయంలో డబ్బులు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఆర్డీ కార్యాలయంలో ఉన్న కొంతమంది సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. బదిలీ కౌన్సెలింగ్‌లో వరుస సంఖ్యలో ఆదిలక్ష్మికి 14వ నెంబర్, కమలా నెహ్రూకు 32వ నెంబర్ వచ్చాయి. వీరిని పక్కనపెట్టి 80వ నెంబర్‌తో ఉన్న జయమ్మను కౌన్సెలింగ్‌కు పిలవడంతో హెల్త్ విజిటర్లు నిరసన వ్యక్తం చేశారు. రిజర్వేషన్, స్పౌజ్ కోటా, సీనియారిటీ ఉన్నప్పటికీ తనను పక్కనబెట్టారని కమలా నెహ్రూ ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ జాబితాలో సీనియారిటీ ఉందని, అధికారులు ముందుగా కాకుండా ఆలస్యంగా పిలిచారని, ఇది ఎక్కడ న్యాయమని మరో హెల్త్ విజిటర్ ఆదిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జరుగుతున్న కౌన్సెలింగ్ తీరును డైరెక్టర్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి దృష్టికి కొంతమంది తీసుకువెళ్లారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చొరవ తీసుకొని రీకౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పలువురు హెల్త్ విజిటర్లు కోరుతున్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

48 గంటల్లో పనులు పూర్తి

శరవేగంగా బస్ బే నిర్మాణ పనులు



బస్ బే పనులు పరిశీలిస్తున్న ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, ఇంజనీరింగ్ సిబ్బంది

సీతమ్మధార : బస్ బే పనులు 48 గంటల్లో పూర్తి చేస్తామని జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణరాజు తెలిపారు. సోమవారం విశాఖ సెంట్రల్ పార్కు ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక నూతనంగా నిర్మించిన బస్ బే పనులను పరిశీలించి , సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామన్నారు. కుంగిపోయిన బస్ బేను సరిచేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం నుంచి ఇంజినీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

కేఏ పాల్ ఆమరణ నిరాహార దీక్ష

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆశీల్‌మెట్టలోని కేఏ పాల్ కన్వెన్షన్ హాల్ ఆవరణలో ఆయన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నాయకులు కేంద్రానికి బానిసలుగా మారారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కోసం 16 వేల మంది భూదానాలు, 32 మంది ప్రాణాలర్పించారన్నారు. లక్షల కోట్లు లాభాలు తెస్తూ.. రూ.8 లక్షల కోట్లు విలువైన స్టీల్‌ప్లాంట్‌ను రూ.4 వేల కోట్లకు అదానీకి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. దీనిపై కోర్టులో కేసు వేసినట్టు తెలిపారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోదీ ఇప్పుడు యువతను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి ప్రధాని మోదీ, చంద్రబాబే కారణమని విమర్శించారు. తెలుగు ప్రజలందరూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ట్వీట్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో పోస్టులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఎవరు ముఖ్యమంత్రి అయినా తాను రూ.4 వేల కోట్లు, తరువాత రూ.40 వేల కోట్లు ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌ను నడిపిస్తానన్నారు.

స్టీల్‌ప్లాంట్ ద్వారా ఏడాదికి లక్ష కోట్లు లాభం చూపిస్తానన్నారు. ఉత్తరాంధ్ర నిరుద్యోగులకు పది లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తానని పాల్ చెప్పారు. ఇంత పెద్ద స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం దారుణమన్నారు. కేంద్రం ఇస్తామన్న ప్రత్యేక హోదా, ప్యాకేజీ, పోలవరం, స్మార్ట్ సిటీ, రెండు కోట్ల ఉపాధి లేకుండా పోయాయని ఆరోపించారు. రాష్ట్రం అప్పులు భారం తీర్చే సత్తా స్టీల్‌ప్లాంట్‌కు మాత్రమే ఉందన్నారు. యువతి, యువకులు, ప్రజలు తరలివస్తే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

భాష.. భావాలకు వారధి

- తెలుగు భాషాభ్యున్నతికి పాటుపడిన గిడుగు
- ఏయూ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ
- నేడు తెలుగు భాషా దినోత్సవం



ఏయూ తెలుగు విభాగం

ఏయూక్యాంపస్: భాష..భావాలకు వారధి. భావాలను పలకించడం అమ్మ నుంచి అలవడుతుంది. అమ్మ నుంచి అబ్బిన భాష మనకు ఆధారంగా మారుతుంది. అమ్మ తొలి పలుకు బిడ్డలో ఆలోచనాశక్తికి ఆలంబనగా నిలుస్తూ పరిసరాలపై అవగాహన పెంచుతుంది. సమాజంపై అవగాహన పెంచడానికి, అనుబంధం పెనవేయడానికి అమ్మభాష ఉపకరిస్తుంది. ప్రపంచ భాషల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న మన మాతృభాష తెలుగు. నేడు తెలుగు భాషా దినోత్సవం.

తెలుగు వారి ఆస్తి గిడుగు

వాడుక భాష వ్యవహారిక భాష కావాలని పరితపించి, పోరాడి సాధించిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు, అందరికీ తెలుగు భాషను చేరువ చేయాలనే లక్ష్యంతో వ్యవహారిక తెలుగును వాడుకలోకి తెచ్చిన తొలి వ్యక్తి రామ్మూర్తి పంతులు. ఆయన జయంతి (ఆగస్టు 29)ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆయన 1893 ఆగస్టు 29న పర్వతాలపేటలో జన్మించారు.



గురజాడ వేంకట అప్పారావుకు సమకాలీకుడు గిడుగు. బీఏ పట్టా పుచ్చుకునే వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. సవరభాషపై ఉన్న ఆసక్తితో ఆ భాషను సైతం గిడుగు రామ్మూర్తి పంతులు నేర్చుకున్నారు.

తొలి విభాగం

ఆంధ్రవిశ్వవిద్యాలయం తొలుత కేవలం నాలుగు కోర్సులతో మాత్రమే ఆరంభమైంది. 1926లో ప్రారంభమైన ఏయూలో తెలుగు, చరిత్ర, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం కోర్సులను ప్రారంభించారు. తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ తొలి ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి కాస్త భిన్నంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ అని పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టుగా తరువాత కాలంలో సంగీతం, నృత్యం, నాటకం వంటి కళలను సైతం దీనిలో భాగం చేశారు. నేటి పాలకులు మరింత ముందుచూపుతో ఆలోచన చేస్తూ డిజిటల్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేసి, ఆడియో ఇంజినీరింగ్, ఫిల్మ్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు తెలుగు విభాగం విరాజిల్లుతోంది. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఇటీవల ఎయిడెడ్ కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకువచ్చి తెలుగు విభాగానికి పూర్వ వైభవాన్ని, జవసత్వాలను అందించారు.



గ్రంథాలయంలో ఉన్న గిడుగు బహూకరించిన పుస్తకాలు

ఏయూకు పుస్తకాలు బహూకరించారు

గిడుగు రామ్మూర్తి పంతులు తాను సేకరించిన, చదివిన అనేక పుస్తకాలను ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయానికి బహూకరించారు. నేటికీ ఈ పుస్తకాలు ఇక్కడ భద్రంగా ఉన్నాయి. పద్మకాదంబరి, కుమారకంతము, బాలదేవీభాగవతము, పార్వతీ పరిణయం, గిరిక పెండ్లి, భజనానంద తరంగిణి, మేజువాణీ, పెద్దాపుర సంస్థాన చరిత్రము, నాట్యోత్పలము, మాతృదేశ సంకీర్తనము, మణిమేఖల వంటి పుస్తకాలు ఏయూ గ్రంథాలయంలో భద్రపరిచారు. స్వాతంత్ర్యానికి పూర్వం ముద్రించిన అనేక పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

వారోత్సవాల నిర్వహణ



తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ తెలుగు శాఖలో వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్యపఠనం, క్విజ్ చర్చా గోష్ఠి, ఉపన్యాసాలు వంటివి ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. –ఆచార్య జర్రా అప్పారావు, విభాగాధిపతి

పెన్షనర్ల సొమ్ము దారి మళ్లింపుపై విచారణ

- 2018లో జూనియర్ అకౌంటెంట్ చేతివాటం



విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీటీవో శ్రీనివాసరావు

మహారాణిపేట : సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సొమ్ము దారిమళ్లింపుపై సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో విచారణ జరిగింది. ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌చార్జి డీటీవో కే శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. 2018లో సీతమ్మధార సబ్ ట్రెజరీలో రూ.1.93 కోట్ల పెన్షన్ సొమ్ము దారి మళ్లింది. ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ ఒకరు ఈ భారీ మొత్తాన్ని తన బంధువులకు చెందిన పెన్షన్ ఖాతాలకు మళ్లించాడు. అప్పట్లో ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది. విచారణ నిర్వహించిన అనంతరం బాధితుల నుంచి రూ.1.40 కోట్లు రికవరీ చేశారు. మిగిలిన రూ.53 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. కేసు విచారణలో ఉండగా జూనియర్ అకౌంటెంట్ మృతి చెందాడు. దీంతో ఈ మొత్తాన్ని ఎలా రికవరీ చేయాలో అన్నదానిపై ట్రెజరీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అప్పటి ఎస్‌టీవో, ఏటీవో పాస్‌వర్డ్ ఎలా తెలిసిందన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. జూనియర్ అకౌంటెంట్ పంపిన బిల్లును సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో), అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) ఆమోదించాల్సి ఉంది. ఈ ఇద్దరు ఆమోదించిన తర్వాత డీటీవోకు వెళుతుంది. అక్కడ ఆమోదించిన తర్వాత బిల్లు రూపంలో పెన్షనర్ల ఖాతాలో జమ అవుతుంది. ఎవరి ప్రమేయం లేకుండా జూనియర్ అకౌంటెంట్ ఒక్కడే ఈ వ్యవహారం నడిపి ఉండడని ఉద్యోగులు చెబుతున్నారు. సోమవారం డీటీవో కార్యాలయంలో జరిగిన విచారణకు ఆరుగురు హాజరయ్యారు. వీరిలో ముగ్గురు రిటైర్ ఉద్యోగులు కాగా, ముగ్గురు సర్వీసులో ఉన్నారు. వీరిని నుంచి స్టేట్‌మెంటు రికార్డ్ చేశారు. విచారణకు విజయనగరం ఏటీవో పి.ఎస్.కుమార్, బాధితుల తరఫున ఎంపీఎం శర్మ హాజరయ్యారు. శాఖాపరమైన విచారణ అనంతరం నివేదికను ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు సమర్పిస్తామని ఇన్‌చార్జి డీటీవో శ్రీనివాసరావు తెలిపారు.

అప్పన్న దేవస్థానానికి రెండు ఎలక్ట్రిక్ బస్సులు



అశోక్‌గజపతిరాజుకు ఆమోద పత్రాన్ని అందజేస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రెండు ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఆమోదం లభించింది. సంబంధిత ఆర్డర్ కాపీని దేవస్థానానికి కమిషనర్ ఎస్. సత్యనారాయణ పంపించారు. ఒక్కో బస్సు ఖరీదు కోటి 65లక్షలు. చార్జర్ పాయింట్ రూ.18 లక్షలతో కొనుగోలుకు కమిషనర్ అనుమతి ఇచ్చారు. ఈమేరకు సంబంధిత పత్రాలను సోమవారం సింహగిరికి వచ్చిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు ఈఈ శ్రీనివాసరాజు అందజేశారు. దేవస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలని సుమారు ఏడాది క్రితం జరిగిన ట్రస్ట్‌బోర్డు సమావేశంలో అశోక్‌గజపతిరాజు నిర్ణయం తీసుకున్నారు. దేవదాయశాఖ ఆమోదం కోసం దేవస్థానం అధికారులు పంపించారు. దీంతో బస్సులు కొనుగోలు కమిషనర్‌నుంచి అనుమతి వచ్చింది. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ప్రధానార్చకుడు ఇరగవపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దర్శనార్థం వచ్చిన అశోక్‌గజపతిరాజు దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బందులు లేకుండా ప్రసాద్ స్కీమ్ పనులు



ప్రసాద్ పథకం పనులపై ఫీల్డ్ విజిట్ చేస్తున్న ఏడీసీ రామచంద్రమోహన్, సీఈ శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగే ప్రసాద్ స్కీమ్ పనులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సింహగిరి మాస్టర్ ప్లాన్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సోమవారం దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఫీల్డ్ విజిట్ చేశారు. ప్రసాద్ స్కీమ్‌లో చేసే పనులకు సంబంధించి ఇప్పటికే డిటైల్ ప్రాజెక్ట్ సిద్ధం చేసి టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. దీనిలో భాగంగా సింహగిరిపై ఏఏ ప్రదేశాల్లో ప్రసాద్ స్కీమ్ పనులు నిర్వహించాలో ఫైనల్ రిపోర్టు తయారుచేసేందుకు వీరు పర్యటించారు. టూరిజం, దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కొండపైన, కొండదిగువ ప్రసాద్ స్కీమ్‌లో జరిగే ప్రదేశాలను పరిశీలించారు. 95శాతం పనులు మాస్టర్‌లో ప్లాన్‌లో ఉన్నాయని, మార్పులుంటే కమిషనర్ అనుమతి తీసుకుంటామన్నారు. వచ్చేనెలలో ప్రసాద్ స్కీమ్ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ విజయ్ భాస్కర్, టూరిజంశాఖ ఈఈ కె.రమణ, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, సింహాచలం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, కమిటీ సభ్యుడు శిల్పిరాజు, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ముదుండి రాజేశ్వరి, సువ్వాడ, పెనుమత్స శ్రీదేవి వర్మ, దొడ్డి రమణ పాల్గొన్నారు.

ప్రియుడే హంతకుడు!

అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

బీచ్‌రోడ్డు: ఎల్‌ఐసీ క్వార్టర్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కళావతి కేసును మూడో పట్టణ పోలీసులు ఛేదించారు. ప్రియుడే హతమార్చినట్టు నిర్ధారించారు. మూడో పట్టణ సీఐ రామారావు తెలిపిన వివరాలు.. కళావతి కుటుంబం కాకినాడలో నివాసముండేది. ఆమె భర్తకు విశాఖ బదిలీ కావడంతో మూడు నెలలనుంచి ఎల్‌ఐసీ క్వార్టర్స్ నివాసముంటున్నారు. కాకినాడలో ఉన్న సమయంలో రతన్ అనే వ్యక్తితో కళావతి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల రతన్ వివాహం చేసుకున్నాడు. ఇది భరించలేని కళావతి తనను కూడా పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. దీంతో కళావతిని వదిలించుకోవాలని రతన్ నిర్ణయించుకున్నాడు. ఈ నెల 24న కళావతి ఇంటికి వెళ్లి గొంతు నులిమి హత్య చేసి తిరిగి కాకినాడ వెళ్లిపోయాడు. బయట ఉన్న కళావతి కుమారుడు తల్లికి ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఈ విషయాన్ని తండ్రికి, పెదనాన్నకు చెప్పాడు. వాళ్లు కూడా ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో భర్త గురుమూర్తికి సందేహం రావడంతో ఇంటికి వెళ్లి చూసే సరికి కళావతి మంచంపై అపస్మారక స్థితిలో ఉండటం గమనించి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మొదటిగా గురుమూర్తిపై కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో అతనిపై ఫిర్యాదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో హత్యగా తేలడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో రతన్‌తో సంబంధం బయటపడింది. రతన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో అసలు నిజం బయటపడింది.

కులం పేరుతో దూషించిన వ్యక్తి ఏడాది జైలు

విశాఖ లీగల్ : కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి లాలం శ్రీధర్ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు గొందేసి అప్పారావు న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదగంట్యాడలో ఉంటున్నాడు. ఈశ్వరరావు అనే వ్యక్తి అప్పారావు ఇంటి ఎదురుగా చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. తన ఇంటి ఎదురుగా చెప్పులు దుకాణం తొలగించాలని చెప్పేవాడు. అందుకు ఈశ్వరరావు తిరస్కరించాడు. దీంతో ఈశ్వరరావుని కులం పేరుతో దూషించాడు. ఈశ్వరరావు తరఫున గంట్యాడ గోవిందరాజు న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ఫుల్ ఫన్ ‘మిస్ శెట్టి-మిస్టర్ పోలిశెట్టి’

- హీరో నవీన్ పోలిశెట్టి
- విశాఖలో చిత్ర యూనిట్ సందడి



హీరో నవీన్, దర్శకుడు మహేష్‌బాబు

డాబాగార్డెన్స్: కుటుంబ సమేతంగా హాయిగా చూసే సినిమా మిస్ శెట్టి-మిస్టర్ పోలిశెట్టి అని చిత్ర యూనిట్ పేర్కొంది. సోమవారం హీరో నవీన్ పోలిశెట్టి (జాతిరత్నాలు ఫేం), దర్శకుడు పి.మహేష్‌బాబు విశాఖలో సందడి చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ అగ్రనటి అనుష్కతో స్క్రీన్ పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుందన్నారు. జాతి రత్నాలు సినిమా తర్వాత మళ్లీ విశాఖ వచ్చానని గుర్తు చేసుకున్నారు. ఇప్పటికే సినిమా ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చిందని, చిత్రంపై మంచి బజ్ ఏర్పడిందన్నారు. ఇందులో తాను స్టాండ్ అప్ కామెడీ పాత్ర చేశానన్నారు. విశాఖలో సీఎంఆర్ షాపింగ్ మాల్, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో ప్రమోషన్ చేశామని, మంచి స్పందన వచ్చిందన్నారు. హీరో ప్రభాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉందని, హీరోయిన్ అనుష్కతో కలిసి సినిమా చేస్తానని చిన్నప్పుడు కల వచ్చిందని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. విశాఖకు చెందిన చిత్ర దర్శకుడు, రచయిత పి.మహేష్‌బాబు మాట్లాడుతూ విశాఖ వాసిగా, విశాఖలో సినిమా ప్రమోషన్ కోసం రావడం సంతోషంగా ఉందన్నారు. హీరో నవీన్ ఎనర్జీ చూపించే సినిమా అని, మంచి కంటెంట్ ఉన్న సినిమాలకు విశాఖలో మంచి ఆదరణ ఉంటుందని చెప్పారు. కథ డిమాండ్ ప్రకారం ఈ సినిమా హైదరాబాద్, లండన్ నగరాల్లో షూట్ చేశామన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ అర్జీలు రిపీట్ కాకూడదు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 190 విజ్ఞప్తులు అందాయి. రెవెన్యూ 67, జీవీఎంసీ 43, పోలీసు 25, ఇతర శాఖలు 55 వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.శ్రీనివాస మూర్తి, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఇంటి కోసం వినతి



తనకు కేటాయించిన ఇంటిని వేరే వారికి వాళ్లకు ఇవ్వడం అన్యాయమని మధురవాడ సుద్దగెడ్డకు చెందిన పి.ధర్మారాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటి కోసం 2018లో దరఖాస్తు చేశానని, 2019లో పరవాడలో ఇల్లు కేటాయించారన్నారు. తరువాత వేరే వ్యక్తులకు ఇచ్చామని అధికారులు చెప్పారని, నాటి నుంచి నేటి వరకు ఇంటి కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నానని చెప్పాడు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీ పెట్టుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశతో ఇక్కడకు వచ్చానన్నాడు.

వినతులకు తక్షణ పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: ప్రజల నుంచి వచ్చే వినతులు త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్న కు చెబుదాం, డయల్ యువర్ మేయర్ కార్యాక్రమంలో ఆమె పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి 65 ఫిర్యాదులు, డయల్ యువర్ మేయర్‌కు 18 వినతులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి పి. నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 61 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ(క్రైం) జి.నాగన్న

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ(క్రైం) జి.నాగన్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నీలిమ మృతి

సింహాచలం: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్లూరు నీలిమ(24) సోమవారం మృతి చెందింది. పెందుర్తి మండలం గొరపల్లికి చెందిన కల్లూరు సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్య సూర్యకుమారి, కుమార్తె నీలిమతో కలిసి గడిచిన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సత్యనారాయణ, సూర్యకుమారి శుక్రవారం మృతిచెందారు. నీలిమ అప్పటి నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. సోమవారం ఉదయం మృతి చెందింది. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో గొరపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఎంకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన నలుగురిపై కేసు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు రాతలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ గోపాలత్ పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు మూడో పట్టణ సీఐ రామారావు తెలిపారు. సోమవారం ఉదయం సెవిన్‌హిల్స్ ఆస్పత్రి సర్కిల్ వద్ద టీఎన్ఎస్ఎఫ్ పేరుతో సీఎంకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.